తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట యాద్రాద్రి భువనగిరి
ఆదివారం
22 ఫిబ్రవరి 2026
పేజీలు : 8



- ప్రజాస్వామ్యంలో ప్రజల సౌకర్యాల కంటే ఎవరూ ఎక్కువ కాదు..
- అధికారులు మాత్రం కళ్లున్నా చూడలేని ధృతరాష్ట్రుల్లా..
- ప్రజలు పన్నులు కడుతున్నది కబ్జాదారుల సౌకర్యం కోసమా? అభివృద్ధి కోసమా..అంటూ..
- బహిరంగ కబ్జా అవుతున్నా.. భూగర్భ మురుగు కాలువలు..
- చిరు వ్యాపారుల్లో 90 శాతం శ్రీమంతులే..10 శాతం పేద వారు..
- రోడ్డు విస్తరణ అండర్ గ్రౌండ్ డ్రైనేజీని సైతం.. వదలని కబ్జాదారులు
- డ్రైనేజీలపై ఉన్న ప్రతి అక్రమ నిర్మాణాన్ని వెంటనే తొలగించాలి..

# కబ్జా కోరల్లో చండూరు ..

## మౌన ముద్రలో అధికార యంత్రాంగం!

**చండూరు, ఫిబ్రవరి 21 (జనంసాక్షి)** ప్రభుత్వ ఆస్తులు అంటే అనాథలు కావు.. ప్రజల పన్నుల రూపంలో నిర్మించిన ప్రజా సౌకర్యాలు. కానీ, నల్గొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలో మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. నిబంధనలను తుంగలో తొక్కి, ప్రజా ప్రయోజనాలను పాతరేస్తూ.. డ్రైనేజీల కబ్జాలు ఇప్పుడు స్థానికంగా పెను కలకలం రేపుతున్నాయి. దుకాణ సముదాయాల యజమానులు సైతం రోడ్డును, డ్రైనేజీలను తమ సొంత ఆస్తిలా భావించి ఆక్రమిస్తుండటంతో ప్రధాన రహదారి నరకప్రాయంగా మారింది. అడ్డూఅదుపు లేని ఈ ఆక్రమణల వెనుక అధికారుల అండదండలు ఉన్నాయా? లేక వారి చేతకానితనం ఉందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు చండూరు వాసులను వేధిస్తున్నాయి. మిగతా 2లో

# నేడు 21వ వార్డులో ప్రజల వద్దకు పాలన

## హుజూర్ నగర్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతాం



**హుజూర్ నగర్, (జనంసాక్షి):** నేడు 21వ వార్డులో ప్రజల వద్దకు వెళ్లి వారి పరిసర ప్రాంతాల్లో ఉన్న సమస్యలను మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ తో కలిసి పరిశీలించడం జరుగుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్ రావు అన్నారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిల్ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ, సిపిఎం, సిపిఐ మెజారిటీ అభ్యర్థులు గెలుపొంది హుజూర్ నగర్ మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందన్నారు. మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో హుజూర్ నగర్ పట్టణాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. ఓటు వేసి గెలిపించిన ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకోవాలనే నిర్ణయంతో పట్టణంలోనే అత్యధిక మెజార్టీ 699 ఓట్లతో గెలుపొంది వైస్ చైర్మన్ గా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తన్నీరు మల్లికార్జునరావు ప్రాతినిధ్యం వహిస్తున్న 21వ వార్డులో నేడు ఉదయం 9 గంటలకు మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున రావు తో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, 21 వ వార్డ్ కీ సంబంధించిన శానిటేషన్, ఇంజనీరింగ్, ఎలక్ట్రిసిటీ అన్ని విభాగాల మున్సిపల్ శాఖ ఉద్యోగ సిబ్బందితో కలిసి ప్రజల వద్దకు వెళ్లి వారి పరిసర ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిశీలించడం జరుగుతుందన్నారు. హుజూర్ నగర్ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులను అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు.

# నేటి నుండి చండూరు జాతర



**చండూరు ఫిబ్రవరి 21 (జనంసాక్షి)** నేటి నుండి చండూరులో జాతర ప్రారంభం కానుంది. శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయములో నేడు ఉదయం విఘ్నేశ్వర పూజ, స్వస్తివాచనము, అంకురార్పణ, మంటపారాధన, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణలతో శ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవాలు (జాతర) ప్రారంభం కానున్నాయి. మిగతా 7లో

# విడతల వారీగా ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు

## ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య




వార్తా లోపలి పేజీలో



## పశువుల సంతలో అన్ని రకాల

# సౌకర్యాలు కల్పిస్తాం

## కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి

**కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి):** కొండమల్లేపల్లి గ్రామపంచాయతీకి అదనపు ఆదాయం చేకూరే దిశగా పశువుల వారసంత నిర్వాణ కీలకమని సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్, పశువుల సంత నిర్వాహకులు దూదిమెట్ల శ్రీనివాస్ యాదవ్, రైతులతో కలిసి పశువుల సంతలో సుమారు 5 లక్షలతో నిర్మించిన పశువులకు ఇబ్బందులు లేకుండా వాహనాల్లో ఎక్కించే ర్యాంపును ప్రారంభించారు. మిగతా 2లో

## మాడుగులపల్లిలో

# యూరియా మాయాజాలం

## అధికారుల నిర్లక్ష్యం డీలర్ల ఇష్టారాజ్యం!




**మాడుగులపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 21 జనంసాక్షి:** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలంలో సాగు పనులు ఊపందుకుంటున్న తరుణంలో రైతులకు యూరియా కష్టాలు మొదలయ్యాయి ఒకవైపు ఎరువుల కొరత వేధిస్తుంటే మరోవైపు ఉన్న స్టాక్ కాస్తా రైతులకు తెలియకుండానే మాయమవుతోంది ఈ వ్యవహారం వెనుక మండల వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లోపం ఫర్టిలైజర్ షాపుల యజమానుల అక్రమ సంపాదన దాగి ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రైతుకు తెలియకుండానే ఖాతా ఖాళీ**

మండలంలోని పలువురు రైతులు తమకు యూరియా కావాలని మిగతా 2లో

# కబ్జా కోరల్లో చండూరు ..

**ప్రజలు పన్నులు కడుతున్నది కబ్జాదారుల సౌకర్యం కోసమా..? లేక అభివృద్ధి కోసమా..?**

మేము పన్నులు కడుతున్నది కబ్జాదారుల సౌకర్యం కోసమా? లేక మా ఊరి అభివృద్ధి కోసమా?" అంటూ చండూరు మున్సిపాలిటీ ప్రజలు మున్సిపల్ అధికారులను సూటిగా ప్రశ్నిస్తున్నారు.

గత కొద్ది రోజులుగా పట్టణంలోని ప్రధాన రహదారులు, ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు కబ్జాదారుల చేతుల్లో చిక్కి విలవిలలాడుతుంటే, అధికారులు మాత్రం కళ్లున్నా చూడలేని ధృతరాష్ట్రుల్లా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన భూగర్భ మురుగు నీటి కాలువలను కొందరు స్వార్థపరులు పూడ్చివేసి, వాటిపై అక్రమంగా షెడ్లు, మెట్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారు. దీనివల్ల మురుగు నీరు వెళ్లే దారి లేక రోడ్ల మీద కు వస్తుంది.రోడ్లపై మురుగు వల్ల పట్టణమంతా కంపు కొడుతోంది. దీనివలన దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయని చిన్న పిల్లల తల్లులు ఆందోళన చెందుతున్నారు.ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారుల్లో చలనం లేకపోవడం వెనుక 'లోపాయికారి ఒప్పందాలు' ఉన్నాయనే అనుమానాలు బలపడుతున్నాయి. ఫిర్యాదు అందిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ యంత్రాంగం 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరించడం కబ్జాదారులకు వరంగా మారింది. అధికారుల ఈ ఉదాసీనత వల్ల అక్రమార్కులు మరింత రెచ్చిపోవడమే కాకుండా, డ్రైనేజీలు ఆక్రమించడం వల్ల రోడ్డు ఇరుకుగా మారి, నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

**పేదరికం ముసుగులో కబ్జాదారుల అరాచకం!**

చండూరులో జరుగుతున్న ఆక్రమణల్లో మరో వికృత కోణం ఏమిటంటే..పేదవాళ్లం, చిన్న వ్యాపారం చేసుకుంటున్నాం" అని చెప్పే వారిలో 90 శాతం మంది ఆర్థికంగా శ్రీమంతులేనని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కేవలం 10 శాతం ఉన్న నిజమైన పేదలను అడ్డుపెట్టుకుని, కొందరు బడా వ్యాపారులు రోడ్లను, కాలువలను ఆక్రమించి దందాలు సాగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీరికి మున్సిపల్ అధికారుల ఆశీస్సులు ఉండబట్టే ఇంత ధైర్యంగా కబ్జాలు చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మేము పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశాం. క్షేత్రస్థాయికి వచ్చి చూడమని వేడుకున్నాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. అధికారులకు, కబ్జాదారులకు మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందాలే దీనికి కారణం" అని చండూరు వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఇప్పుడు నేరుగా జిల్లా కలెక్టర్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. డ్రైనేజీలపై ఉన్న ప్రతి అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేసి, కాలువలను పునరుద్ధరించాలి. ఆక్రమణలు జరుగుతున్నా మౌనంగా ఉన్న స్థానిక అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. రోడ్డు విస్తరణ నిబంధనల ప్రకారం కబ్జాదారుల నుండి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి.ప్రజాస్వామ్యంలో ప్రజల సౌకర్యాల కంటే ఎవరూ ఎక్కువ కాదు.ఒకవేళ అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే, చండూరు ప్రజలమంతా ఏకమై పెద్ద ఎత్తున మున్సిపల్ ఆఫీసును ఆందోళన చేపడతామని చండూరు మున్సిపల్ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# మాడుగులపల్లిలో యూరియా మాయాజాలం

డీలర్ల వద్దకు వెళ్తే మీ కోటా అయిపోయింది అని సమాధానం వస్తోంది అసలు తాము వేలిముద్ర వేయకుండా ఓటీపీ చెప్పకుండా తమ ఆధార్ కార్డుల మీద యూరియా విక్రయాలు జరిగినట్లు ఆన్లైన్లో ఎలా చూపిస్తుందని రైతులు విస్తుపోతున్నారు. రైతుల వ్యక్తిగత వివరాలను ముందే సేకరించిన కొందరు కేటుగాళ్లు, అధికారుల కళ్లు గప్పి లేదా వారి సహకారంతో ఈ-పోస్ యంత్రాల్లో దొంగ ఎంట్రీలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**ఆన్లైన్ బుకింగ్ అంతా గందరగోళం**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్లైన్ పంపిణీ విధానం సామాన్య రైతులకు శాపంగా మారింది సమయం తెలియదు యూరియా లోడ్ ఎప్పుడు వస్తుంది ఏ సమయంలో ఆన్లైన్ పోర్టల్‌లో బుకింగ్ ప్రారంభమవుతుంది అన్న సమాచారం రైతులకు అందడం లేదు డీలర్ల చేతివాటం స్టాక్ రాగానే షాపుల యజమానులు తమకు అనుకూలమైన వారికి లేదా బ్లాక్ మార్కెట్ వ్యాపారులకు ముందుగానే కేటాయించుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల మౌనం ఈ గందరగోళంపై మండల వ్యవసాయ అధికారులు రైతులకు స్పష్టత ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యారు.

**కుమ్మక్కైన యంత్రాంగం**

ఫర్టిలైజర్ షాపుల్లో నిల్వలు ఎంత ఉన్నాయి పంపిణీ పారదర్శకంగా జరుగుతుందా అని తనిఖీ చేయాల్సిన బాధ్యత అధికారులదే కానీ మాడుగులపల్లి మండలంలో అధికారులు ఏసీ గదులకే పరిమితం కావడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం

**రైతుల డిమాండ్**

మాకు వ్యవసాయం చేయడం వచ్చు కానీ ఈ ఆన్లైన్ మాయాజాలం అర్థం కావడం లేదు అధికారులు వెంటనే స్పందించి యూరియా ఎప్పుడు వస్తుందో ఎప్పుడు ఆన్లైన్లో పెడతారో స్పష్టంగా ప్రకటించాలి అక్రమాలకు పాల్పడుతున్న ఫర్టిలైజర్ షాపుల లైసెన్సులను రద్దు చేయాలి అని మండల రైతాంగం డిమాండ్ చేస్తోంది.

# శివాలయంలో అన్నప్రాసన వేడుకలు

## నూతన వస్త్రాల భాహుకరణ



**అన్నపురెడ్డిపల్లి ఫిబ్రవరి 21 (జనంసాక్షి)** మండల కేంద్రము లో వెలిసి ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయం లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అభిమాని కోంద్రు నాగరత్నంబాబు కృష్ణ ప్రియ దంపతుల కుమారుడి అన్నప్రాసన వేడుక నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలయ చైర్మన్ మల్లెల నరసింహారావు ఆయన సతీమణి కోంద్రు నాగరత్నంబాబు దంపతలకి నూతన వస్త్రాల భాహుకరణ చేశారు అనంతరం వచ్చిన బంధువులకి భోజన వసతి కల్పించారు. కోంద్రు నాగరత్నంబాబు మాట్లాడుతూ మా యొక్క ఈ కార్యక్రమానికి వచ్చి మమ్మల్ని ఆశ్చీర్వదించి మాకు సహాయం చేసిన మల్లెల నర్సింహారావు దంపతులకి ఎప్పుడు రణపడి ఉంటాము అని కోంద్రు రత్నబాబు దంపతులు వారికి శాలువాతో సత్కరించారు. అదేవిధంగా మా తరపున వచ్చిన మా బందువులకు భోజన వసతి కూడా ఎంతో ప్రేమతో ఏర్పాటు చేసినందుకు మా కుటుంబం తరపున వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఇలాంటి మంచి మనసుతో మాకు అండగా నిలిచిన మల్లెల నరసింహారావు కి మరియు వారి కుటుంబ సభ్యులకు మా కుటుంబం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది.

# పశువుల సంతలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం

## కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పశువుల సంత నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టామని రైతులకు పశుపోషకులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పశువుల వారసంత వల్ల అమ్మకం దారులు, కొనుగోలుదారులకు పరస్పరం లాభం చేకూర్చే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. పశువుల సంతలో మూగజీవాల రక్షణ రైతుల సౌకర్యం కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు అతి త్వరలో పశువుల సంతలో రైతులకు సామాన్య ప్రజలకు అవసరమైన తాగునీరు, నీడ కోసం రేకుల షెడ్లు, జంతువులకు సరైన నీటి తొట్టెలు, అన్ని రకాల పారిశుధ్య వసతులు, సుదూర ప్రాంతాల నుండి వచ్చే వారికోసం విశ్రాంతి స్థలాలు, పశువుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చేస్తామన్నారు. ఎండ, వానల నుండి పశువులను రక్షించడానికి శాశ్వతమైన రేకుల షెడ్ల నిర్మాణం, రైతులకు విశ్రాంతి తీసుకునే స్థలం ఏర్పాటు చేస్తామన్నారు. సంత జరిగిన తర్వాత జంతువుల వ్యర్థాలను తొలగించి సంత ప్రాంతాన్ని శుభ్రం చేయడానికి సిబ్బందిని కెటాయిస్తామన్నారు. వాహనాలు రావడానికి సరైన రహదారులు, పార్కింగ్ స్థలం, రాత్రి సమయంలో విద్యుత్ దీపాల ఏర్పాటు చర్యలు తీసుకుంటామన్నారు. దళారుల దోపిడీని నిరోధించడానికి మార్కెట్ ఫీజులకు సంబంధించిన బోర్డులను ప్రదర్శించడం పారదర్శకమైన కొనుగోలు విధానం పాటించాలని పశువుల సంత కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఇకపై పశువుల సంత నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. వారివెంట ఉపసర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య, సంత కాంట్రాక్టర్ దూదిమెట్ల శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు, రైతులు, గ్రామపంచాయతీ అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చదువుకున్న పాఠశాల పట్ల మమకారం చూపటం

# పూర్వ విద్యార్థులకు మారం గోపాల్ రెడ్డి ఆదర్శప్రాయం..

### 171 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ







**చండూరు, ఫిబ్రవరి 21 (జనంసాక్షి )** తమ మూలాలను మరిచిపోకుండా, చదువుకున్న పాఠశాల విద్యార్థులకు సాయం చేయడం నిజమైన దేశభక్తి అని చండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి మారం గోపాల్ రెడ్డి నిరూపించారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 171 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు.కెనరా బ్యాంక్ తెలంగాణ జోనల్ సేల్స్ హెడ్‌గా పనిచేస్తున్న మారం గోపాల్ రెడ్డి (గుండ్రేపల్లి గ్రామం) తన స్వంత నిధులు సుమారు రూ. 13 లక్షలతో ఈ సైకిళ్లను కొనుగోలు చేశారు. సుదూర ప్రాంతాల నుండి నడుచుకుంటూ.. వచ్చే విద్యార్థుల కష్టాలను తీర్చి, వారు చదువుపై మరింత శ్రద్ధ చూపేలా చేయడమే ఈ పంపిణీ ఉద్దేశం అదేవిధంగా ప్రతి పూర్వ విద్యార్థి చదువుకున్న పాఠశాలకు ఏదో విధంగా సహాయ సహకారాలు అందించాలని మారం గోపాల్ రెడ్డి కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల సమక్షంలో ఈ కార్యక్రమం పండుగలా సాగింది.ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. సైకిళ్లు అందుకున్న విద్యార్థుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. గోపాల్ రెడ్డి చదువుకున్న పాఠశాల పట్ల చూపిన మమకారం ఇతరులకు ఆదర్శప్రాయమని కొనియాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సైకిళ్లను బహుమతిగా అందించిన మారం గోపాల్ రెడ్డి కి పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కౌన్సిలర్ గా గెలిపించిన వార్డు ప్రజలకు ధన్యవాదాలు



**సూర్యాపేట(జనంసాక్షి):** ఇటీవల జరిగిన సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో 23వ వార్డు కౌన్సిలర్ గా తనను గెలిపించిన వార్డు ప్రజలకు నూతనంగా ఎన్నికైన ఆ వార్డు కౌన్సిలర్ వల్దాస్ లక్ష్మీ రెబల్ శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.జిల్లా కేంద్రంలోని వారి నివాసంలో పలువురు నాయకులు,కార్యకర్తలు వారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 23వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరికీ అందేలా చూస్తామన్నారు.తనపై నమ్మకం ఉంచి గెలిపించిన వార్డు ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ పిడమర్తి నాగరాజు, అబ్బాస్, ఈశ్వర్,రాజు, వెంకటేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా సామ్రాజ్యవాదాన్ని తరిమికొడదాం



**కోదాడ, ఫిబ్రవరి21 (జనంసాక్షి):** అమెరికా సామ్రాజ్యవాదం తన ఆధిపత్యాన్ని తన ఆయుధ బలగాన్ని ఉపయోగించి ప్రజాస్వామ్య దేశాల పైన యుద్ధాలు ప్రకటించి క్రూడ్ ఆయిల్ కొల్లగొట్టేందుకు తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు . శనివారం సుందరయ్య భవనంలో సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం ఫిబ్రవరి 21 న రెడ్ బుక్ డే సందర్భంగా ×బరితెగించిన అమెరికన్ సామ్రాజ్యవాదం అనే× పుస్తకం పై నియోజకవర్గ స్థాయిలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నెమ్మది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక దేశాల మధ్య యుద్ధాలను సృష్టిస్తూ ప్రపంచంలో అశాంతిని సృష్టిస్తూ ఆయుధాలను అమ్ముకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వెనిజులాలో ప్రజాస్వామ్య రహితంగా ఎన్నికైన ఆదేశ అధ్యక్షుడు నికోలస్ మధురో ను అతని భార్యను అర్ధరాత్రి కిడ్నాప్ చేసి అమెరికాకు తరలించడం అమానవీయ చర్య అని ఆయన విమర్శించారు .అట్లాగే గతంలో అమెరికా ఇరాక్ లిబియా చిలి ఆఫ్ఘనిస్తాన్ అధ్యక్షుల్ని హతమార్చి తన కీలుబొమ్మ ప్రభుత్వాలును పెట్టుకొని చమురు ఆధిపత్యాన్ని చలామణి చేశారని ఆయన అన్నారు .ఆయా దేశాల పైన యుద్ధాలు చేసి తన ఆయుధ సంపదను అమ్ముకుంటున్నారని ఆయన విమర్శించారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన తర్వాత సుంకాల పేరుతో భారత్ పై యుద్ధం ప్రకటించారని అమెరికా ట్రంప్ తనపై సుంకాల విధిస్తుంటే మోడీ మాత్రం మౌనవ్రతం వీడలేదని ఆయన విమర్శించారు సామ్రాజ్యవాదం లాంటి విష సర్పాలను అంతమొందించకపోతే ప్రపంచ శాంతికి మనుగడ ఉండదని ఆయన అన్నారు . ఈ యొక్క సమావేశానికి రాపోలు సూర్యనారాయణ అధ్యక్ష వహించగా ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే సైదా జిల్లెపల్లి నరసింహారావు జూలకంటి విజయలక్ష్మి బెల్లంకొండ సత్యనారాయణ సిపిఎం జిల్లా నాయకులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు మునగాల సిపిఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు అలసగాని బ్రహ్మయ్య నాగటి రాములు ఉయ్యాల నరసయ్య దేవర వెంకటరెడ్డి వీరబోయిన వెంకన్న చందా చంద్రయ్య మండవ వెంకటాద్రి సోంపంగు జానయ్య ఆరే రామకృష్ణారెడ్డి జుట్టుకొండ వీరయ్య కొండమడుగుల చిన్న వెంకటేశ్వర్లు గోపతి బిక్షం తదితరులు పాల్గొన్నారు.



## కన్నుల పండుగగా శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర

### నియోజక వర్గ ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### వడ్త్య రమేష్, బీ ఆర్ ఎస్ నియోజకవర్గ నాయకులు

**దేవరకొండ, ఫిబ్రవరి 21(జనంసాక్షి)** గుండ్లపల్లి (డిండి) మండలం దాసరి నెమలి పూర్ లో కొలువైన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి జాతర శనివారం కనుల పండుగగా జరిగింది. ఈ జాతర సందర్భంగా బి ఆర్ ఎస్ నాయకులు వడ్త్య రమేష్ స్వామి వారిని దర్శించుకొని, వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కమిటీ సభ్యులు వారిని శాలువాతో సత్కరించారు.దేవరకొండ ప్రజలందరు సుభిక్షంగా అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా వర్ధిల్లాలని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమం సర్పంచ్ రఫియా-భాషిర్ , ఉప సర్పంచ్ రాంరెడ్డి,నరేందర్ రెడ్డి,భగవత్, శ్రీను,తదితరులు పాల్గొన్నారు...

# గ్రామ పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం



**కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి):** కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి అధ్యక్షతన గ్రామ పంచాయతీ పాలకవర్గంతో స్థానిక సమస్యలు పరిష్కరించడానికి, పలు అభివృద్ధి పనులపై సాధారణ సమావేశం పంచాయతీ కార్యదర్శి డాకు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి మాట్లాడుతూ కొండమల్లేపల్లి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని గ్రామ ప్రజలు వ్యాపారస్తులు అందరు సహకరించాలని ప్రధాన రహదారులు, సీసీ రోడ్లు, జనావాస ప్రాంతాలలో చెత్తాచెదారం వ్యర్థాలు పడేయకుండా గ్రామపంచాయతీ పారిశుధ్య ట్రాక్టర్ లోనే పడేయాలన్నారు. అతి త్వరలో ఎమ్మెల్యే బాలునాయక్ ఆశీస్సులతో కొండమల్లేపల్లి గ్రామానికి మరింత నిధులు తీసుకొచ్చి గ్రామంలో కావలసిన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానన్నారు. సాధారణ సమావేశం నిర్వహించి పంచాయతీ సెక్రటరీ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని కోరారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్తులు నమ్మకంతో నన్ను గెలిపించినందుకు ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా నిజాయితీగా పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పెన్షనర్స్ భవనం లో సామూహిక జన్మదిన వేడుకలు

నేరేడుచర్ల (జనంసాక్షి) : పెన్షనర్స్ భవనంలో చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి అధ్యక్షతన సామూహిక జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భువనగిరి లక్ష్మమ్మ,జమ్మి గుంపుల విజయ లకు,పూలమాలలతో శాలువ లతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలన్నారు. హెల్త్ కార్డు లేని వారికి వెంటనే హెల్త్ కార్డులు మంజూరి చేయాలని, 2024 ఏప్రిల్ లో పదవి విరమణ పొందినటువంటి పెన్షనర్లకు రావలసినటువంటి గ్రాటివిటీ, కమిటీ రేషన్, ఏరియర్స్ ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పి. సత్యనారాయణ, బి.బుద్ధారెడ్డి, బి సుందరయ్య, వి.లక్ష్మారెడ్డి, కే.రంగారెడ్డి వై. లక్ష్మీకాంతమ్మ, సిహెచ్. వీరభద్రరావు, వెంకటేశ్వర్లు,జి.వీరారెడ్డి, ఆర్. మంగ్య, పి.శ్రీరామ్ రెడ్డి, జయసుందర్రావు, ఎన్ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

# నేడే.. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం!





**చండూరు, ఫిబ్రవరి 21 (జనంసాక్షి)** చండూరు మున్సిపాలిటీ మరియు మండల పరిధిలోని ప్రజల కోసం కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు (ఫిబ్రవరి 22, ఆదివారం) ఉచిత భారీ కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. ఉదయం 9 గంటల నుండి ప్రారంభం మునుగోడు క్యాంపు కార్యాలయం 50 ఏళ్లు పైబడిన వారు ఈ శిబిరానికి హాజరుకావచ్చు.ఆధార్ కార్డు, యాక్టివ్‌లో ఉన్న ఫోన్ నెంబర్ మరియు ప్రస్తుతం వాడుతున్న మందులు తప్పనిసరి. పరీక్షల అనంతరం కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమైన వారిని వెంటనే హైదరాబాద్‌కు తరలిస్తారు. అక్కడ ఉచితంగా ఆపరేషన్ పూర్తి చేసి, తిరిగి సురక్షితంగా తీసుకు రావడం జరుగుతుంది.ప్రజల కంటి వెలుగు కోసం కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చేస్తున్న ఈ సేవ అమూల్యమైనది. మండలంలోని ప్రతి గ్రామం నుండి అవసరమున్న వారు ఈ శిబిరానికి తరలివచ్చి పరీక్షలు చేయించుకోవాలి.

## వాసవి వనితా క్లబ్ ల సేవలు అభినందనీయం

### మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది



**సూర్యాపేట (జనంసాక్షి):** వాసవి వనితా క్లబ్ లు సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమంలో ముందు వరుసలో ఉంటాయని, వారి సేవలు అభినందనీయమని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.శనివారం విద్యానగర్ లోని శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవాలయంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు లక్కవరపు పద్మజ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ సమాజంలో నైతిక విలువలు, ఆధ్యాత్మిక భావజాలాన్ని పెంపొందించడానికి మహిళా సంఘాలు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వాసవి వనితా క్లబ్ చైర్మన్ లక్కవరపు పద్మజ, కార్యదర్శి కక్కిరేణి అనిత, కోశాధికారి బెలిదె లక్ష్మి, ఆర్సీ జూలకంటి నాగరాజు, ఆర్ఎస్ కలకోట అనిత, ఐపీసీలు రాచకొండ శ్రీనివాస్, మిట్టపల్లి రమేష్, బజ్జూరి శ్రీనివాస్, తెరటపల్లి సతీష్, శ్రీరంగం రాము తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

**15వేల మొక్కలు నాటిన రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్ర.**

**బూర్గంపహాడ్ ఫిబ్రవరి 21 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :– పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీరామ్ ప్రసాద్ అన్నారు. శనివారం సారపాక రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్ర ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా బూర్గంపహాడ్ మండల పరిధిలోని తాళ్లగొమ్మూరులో 15వేల మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమాన్ని ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ తో కలిసి ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోటరీక్లబ్ ఇన్ భద్ర నిర్వాహకులు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని మొక్కలు నాటిస్తే స్వచ్ఛమైన గాలి తో పాటు జీవరాశులకు మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమం లో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, చాంద్ భాషా, హెచ్ఆర్ హెడ్ శ్యామ్ కిరణ్, భాస్కర రావు, ప్రఫుల్లకుమార్, అడ్మిన్ మేనేజర్ చంగల్ రావు, బసప్ప రమేష్, రాజశేఖర్, సత్య నారాయణ, మురళీధర్, తిరుపతిరావు, మహేష్, రోటరాక్టర్లు విద్యావాణి, మల్లికార్జున్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమం



వలిగొండ మండలం ఫిబ్రవరి 21 (జనంసాక్షి ) వలిగొండ మండలంలోని లోతుకుంట అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ లావణ్య, స్థానిక ఏ.ఎన్.ఎం కె.శోభారాణి విచ్చేసినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల నుండి ఆరేళ్ల వరకు ఉన్న పిల్లలందరినీ అంగన్ వాడి కేంద్రానికి తప్పకుండా పంపించాలని అక్కడికి వచ్చిన తల్లులకు తెలియజేయడం జరిగింది. అంగన్వాడీలో పిల్లలకి పోషకాహారం అందించడంతోపాటు ఆటపాటలతో పిల్లలలో ఉన్న సృజనాత్మకతను, మానసిక శారీరక ఎదుగుదలను జ్ఞాపకశక్తి పెంపొందించే అనేక కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుంది. ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ లో పిల్లలలో ఉన్న లోపాలను వెలికి తీసి తగు జాగ్రత్తలు తీసుకోవడానికి ఒక వేదికగా అంగన్వాడి ఉపయోగపడుతుంది. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలని అంగన్వాడీ కేంద్రానికి తప్పకుండా పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్పర్ ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ ప్రవీణ్ , అంగన్వాడీ టీచర్ విజయ, అంగన్వాడి ఆయా షీలా శారద, స్థానిక ఆశ వర్కర్ ఐలపాక అరుణ, పిల్లల తల్లులు కలకూరి మౌనిక, షీలా రేణుక, పాక మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రహదారి విస్తరణ పనులు పరిశీలన

### ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**వలిగొండ మండలం ఫిబ్రవరి 21 (జనంసాక్షి )**

వలిగొండ మండల కేంద్రంలో శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీడీవో జలంధర్ రెడ్డి జరుగుతున్న రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. నిర్వహిస్తున్న కొలతల ప్రక్రియను అధికారులు వివరించారు. అదేవిధంగా ఫుట్‌పాత్ , రహదారి పక్కన దుకాణాలు నిర్వహిస్తున్న పౌరులతో మాట్లాడి, రహదారి విస్తరణ వల్ల ప్రభావితమవుతున్న వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభావిత వ్యక్తుల పేరు, వృత్తి/వ్యాపారం, గుర్తింపు వివరాలు తదితర సమాచారాన్ని సేకరించి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి సమర్పించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. సిబ్బందికి వివరాలను ఖచ్చితంగా సేకరించాలని, తదుపరి చర్యల కోసం సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విడతల వారీగా ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు

### ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి,ఫిబ్రవరి 21(జనంసాక్షి):**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని ప్రతి ఒక్క పేద కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడం జరుగుతుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మంజూరు పత్రాలు అందజేశారు. టేకులపల్లి మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు రైతు వేదికలో శనివారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.టేకులపల్లి మండలం లోని గిరిజనులకు ప్రత్యేకంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతులు మీదుగా అందించారు. మొదటి విడతగా 881 ఇళ్లను మంజూరు చేయగా, గిరిజనులకు ప్రత్యేకంగా 293 మంది లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. ఏప్రిల్ నెలలో మరో విడత ఇందిరమ్మ ఇళ్లను అందించడానికి సిద్ధం చేయడం జరుగుతుందని అన్నారు.ఫైరవీలకు తావు లేకుండా నిజమైన పేదవాళ్ళని గుర్తించి ఎంపిక చేయటం జరుగుతుందని స్పష్టం చేసారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి, ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగిలాల్ నాయక్, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, మండల అధ్యక్షులు దేవా నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డ్ మెంబర్లు,మాజీ ఎంపీటీసీలు,మహిళా నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు వరిగడ్డి వాము దగ్ధం



**టేకులపల్లి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి):**

ప్రమాదవశాత్తు వరిగడ్డి వాము దగ్ధమైన సంఘటన మండలంలోని సులానగర్ గ్రామంలో శనివారం జరిగింది. కేలోత్ శంకర్ అనే రైతుకు చెందిన వరిగడ్డి వాము ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని భారీగా పొగలు లేస్తుండడంతో చుట్టుప్రక్కల వారు గమనించి వెంటనే ఆర్పే ప్రయత్నం చేశారు. పశువుల కోసం నిల్వ ఉంచిన వరిగడ్డి కాలిపోవడంతో సుమారు 50 వేల రూపాయలు నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన చెందుతున్నాడు. చుట్టుప్రక్కల వారి వెంటనే గమనించి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు అయింది.

## బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్




**వలిగొండ మండలం ఫిబ్రవరి 21 (జనం సాక్షి )**

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు పిలుపుమేరకు తెలంగాణ కాంగ్రెస్ గాంధీ భవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో వలిగొండ బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపేందుకు వెళ్ళనీయకుండా ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ బుంగమట్ల మహేష్, మందాటిరంజిత్ రెడ్డి, ఆమనగంటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్షీరాభిషేక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి : జోగు అంజన్న

**వలిగొండ మండలం ఫిబ్రవరి 21 (జనంసాక్షి)**

ఫిబ్రవరి 23న వలిగొండ పట్టణ కేంద్రంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశం మేరకు జరిగే క్షీరాభిషేక కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు శీలం స్వామి పిలుపునిచ్చారు. శనివారం వలిగొండ పట్టణ కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం మేరకు సబ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పాత్రికేయుల సమావేశంలో ప్రకటించడం పట్ల వారికి కృతజ్ఞతగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షులు



మహేష్ కుమార్ గౌడ్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేసేందుకు మండల నలుమూలల నుండి ఉద్యమకారులంతా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉద్యమకారులు చిలుగూరి సత్తిరెడ్డి,జిల్లా కార్యదర్శి కదిరేని స్వామి, బొడిగే సుదర్శన్, కళాకారుల విభాగం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎదురుగట్ల యాదగిరి, కొండూరు సత్తయ్య, కన్నెకంటి శ్రీనివాసచారి, ఎదురుగట్ల లక్ష్మయ్య, ఎదురుగట్ల సందయ్య, ఎడవల్లి కిరణ్, దండ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## పిల్లలకు సకాలంలో టీకాలు వేయించండి సర్పంచ్ సమ్మయ్య

**పినపాక, ఫిబ్రవరి 21(జనంసాక్షి):**
పోట్లపల్లి గ్రామపంచాయతీ ప్రజలు పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని సర్పంచ్ సమ్మయ్య సూచించారు. పినపాక మండలం పోట్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన టీకా కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించి, అక్కడి సౌకర్యాలు, వైద్య సేవలను వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల సూచనల మేరకు పుట్టిన శిశువుల నుండి 18 సంవత్సరాల లోపు పిల్లల వరకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. టీకాలు పిల్లలను అనేక అంటురోగాల నుండి రక్షిస్తాయని, ప్రతి తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గ్రామంలో టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.

## ఖమ్మం నగరంలో హృదయ విదారక ఘటన

### దయా గుణానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన అన్నం ఫౌండేషన్





**ఖమ్మం, (జనంసాక్షి):**
ఖమ్మం నగరంలోని టేకులపల్లి డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతానికి చెందిన గొల్లపల్లి నవీన్ (వయస్సు 25 సంవత్సరాలు) గత మూడు సంవత్సరాలుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆరోగ్యంగా ఉన్న సమయంలో కుటుంబానికి ఆధారంగా నిలిచిన నవీన్, అనారోగ్యం బారిన పడి జీవితం అర్ధాంతరంగా ముగిసింది. మృతుని తల్లి లత వికలాంగురాలు కాగా, తమ్ముడు సాల్మన్ సైతం వికలాంగుడే. కుటుంబంలో ఎవరికీ పని చేసే పరిస్థితి లేకపోవడంతో ఈ కుటుంబం తీవ్ర ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది. అనారోగ్య సమయంలోనే మృతుని భార్య వదిలివెళ్లడం ఈ కుటుంబాన్ని మరింత దుఃఖసాగరంలోకి నెట్టింది. ఇలాంటి దుర్భర స్థితిలో కుమారుడి మృతి చోటు చేసుకోవడంతో తల్లి, తమ్ముడు తీవ్ర శోకంలో మునిగిపోయారు. ఆర్థిక స్థోమత, ఆరోగ్య పరిస్థితులు అనుకూలించకపోవడంతో మృతదేహానికి అంత్యక్రియలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. నిన్న మధ్యాహ్నం నుంచి మృతదేహం ఇంటిలోనే ఉండిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు వెంటనే అన్నం ఫౌండేషన్ కు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే స్పందించిన అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సభ్యులు మృతదేహం వద్దకు చేరుకుని, దానిని ఫౌండేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహానికి నూతన వస్త్రాలు ధరింపజేసి, తెల్ల వస్త్రంలో చుట్టి, పూలు–పూల దండలతో గౌరవప్రదంగా అలంకరించి, నగరంలోని బల్లేపల్లి వైకుంఠ దామంకు తరలించి గౌరవప్రదంగా దహన సంస్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు గుండ్ల రవి, పేర్ల మధు, మృతుని తల్లి లత, తమ్ముడు సాల్మన్, బంధువులు పాల్గొన్నారు. దిక్కులేని పరిస్థితిలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వానికి ప్రతిరూపంగా అన్నం ఫౌండేషన్ చేసిన సేవకు స్థానికులు ప్రశంసలు కురిపించారు. మానవత్వమే మహోన్నత ధర్మమని మరోసారి నిరూపించిన సంఘటనగా ఇది నిలిచింది.

## ఘనంగా ప్రారంభమైన కరుణగిరి పుణ్యక్షేత్ర యాత్ర మహోత్సవాలు

### ప్రారంభించిన బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్

**ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 21(జనంసాక్షి):**
మండలంలోని స్థానిక కరుణగిరిలో, కరుణగిరి యాత్ర 27 వ మహోత్సవాలు ప్రారంభమైయ్యాయి. శనివారం మహోత్సవాలను బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ పతాక ఆవిష్కరణ చేసి ప్రార్థనలతో ప్రారంభించారు. దీనిలో మత గురువులు, సిస్టర్లు, బ్రదర్ లు, వేలాది భక్తులు, సంఘ పెద్దలు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన బిషప్ ఈ యాత్ర మహోత్సవాల సందర్భంగా నవదిన ప్రార్థనలను ప్రతిరోజు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ ప్రార్థనలు ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమవుతాయని అన్నారు. 27వ తేదీ నుండి మార్చి ఒకటో తేదీ వరకు ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతాయని, ఒకటవ తేదీ సాయంత్రము విశ్రాంత బిషప్ శ్రీశ్రీ మైన్ పాల్ చే పవిత్ర దివ్య బలి పూజ ఉంటుందని. మహోత్సవ దివ్య బలి పూజ హైదరాబాద్ అగ్ర పీఠాధిపతులు మరియు సిబిసిఐ ప్రెసిడెంట్ కార్డినల్ పూల ఆంథోని సమిష్టి పండగ పూజ నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రతిరోజు సాయంత్రం భక్తి రస సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ఈలాంటి అవకాశాలను ఉపయోగించుకొని క్రమశిక్షణతో భక్తి తో కార్యక్రమాలకు అనుగుణంగా సహకరించాలని, ఈ యాత్ర మహోత్సవ ప్రతి అంశములోనూ భాగస్వామ్యులై ప్రార్థనా పూర్వకంగా వీటిని నడిపించాలని సంవత్సరమునకు ఒకసారి జరిగే రెండు జిల్లాల స్థాయిలో ఉన్న విస్తరించి ఉన్న కతోలిక సంఘము ఆ స్థాయిలో అందరూ సహకరించాలని కోరినారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వారికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



## ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పర్యటనకు శ్రీకారం

### చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్

**కల్లూరు ఫిబ్రవరి 21(జనంసాక్షి)**
కల్లూరుమున్సిపాలిటీలోని 20 వార్డుల పరిధిలో గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్య లను గుర్తించేందుకు ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటనకు శ్రీకారం చుట్టినట్లు కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ తెలిపారు. శనివారం కల్లూరు మున్సిపాలిటీ పరిధి కప్పల బంధం గ్రామంలోని ఒకటి, రెండు మున్సిపల్ కౌన్సిలర్ల వార్డుల పరిధిలో నెలకొన్న సమస్యలను నేరుగా ప్రజలను కలిసి తెలుసుకునేందుకు చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి, కౌన్సిలర్లు జిల్లెల్ల స్వాతి, బీరెల్లి మాధవ్, కాంగ్రెస్ నాయకులు యాసా శ్రీకాంత్, జిల్లెల్ల కృష్ణారెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు . క్షేత్రస్థాయిలో గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని మురుగునీటి నిలువలు పేరుకు పోయి ఇబ్బంది పడుతున్నామని, పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సౌకర్యం లేదని, అంతర్గత రహదారులను సిసి రోడ్లుగా అభివృద్ధి పరచాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పలు సమస్యలను ప్రజలు చైర్మన్ మోహన్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా స్వచ్ఛమైన త్రాగునీటిని సరఫరా చేయాలని, బోర్లు మరమ్మత్తు చేపట్టాలని, ఎస్సీ కాలనీ లో మినీ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి వెళ్లేందుకు కరెంటు లైన్ ఏర్పాటు చేసి సిసి రోడ్డు నిర్మించాలని ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. ఆంజనేయస్వామి టెంపుల్ సమీపానగల మంచినీటి బావి వద్దకు వెళ్లేందుకు వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నామని సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. గ్రామస్తుల నుంచి క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను కౌన్సిలర్లతో చర్చించి ప్రణాళిక ప్రకారంగా నిధులు కేటాయించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని చైర్మన్ మోహన్ నాయక్ ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలను, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని అంగన్వాడి కేంద్ర నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని, విద్యార్థులకు క్రమశిక్షణతో విద్యను నేర్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ప్ర జలకు అవసరమైన తాగునీరు, విద్యుత్, సిసి రహదారులు, డ్రైనేజీల నిర్మాణం తదితర అంశాలపై పర్యటనలో వచ్చిన సమస్యలను పరిగణలోకి తీ సుకొని కౌన్సిలర్ల సమావేశంలో సమీక్షించి వాటిని పరిష్కరించే దిశగా కృషి చే యటం జరుగుతుందని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి గతంలో మంజూరైన 15 కోట్ల రూపాయలతో ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆధ్వర్యంలో ఎన్నికలకు ముందు సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, పట్టణ సెంటర్లోనేషనల్ హైవేపై డివైడర్ సెంట్రల్ లైటింగ్ మెయిన్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద ల దృష్టికి క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యల పరిష్కారం , నిధుల మంజూరు కోసం మున్సిపల్ పాలకవర్గం తో కలసి వారి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చైర్మన్ మోహన్నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్లు జిల్లెల్ల స్వాతి, బీరెల్లి మాధవ్, చైర్మన్ మోహన్ నాయక్ వైస్ చైర్మన్ కోటేశ్వరి లను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తల్లపు రెడ్డి అనిమిరెడ్డి, జిల్లెల్ల శ్రీనివాస్ రెడ్డి, జిల్లెల్లవెంకట్ రెడ్డి కర్నాటి పిచ్చిరెడ్డి శీలం నాగిరెడ్డి, జిల్లెల్ల భాస్కర్ రెడ్డి, జిల్లెల్ల కృష్ణారెడ్డి తేళ్లూరి లాలయ్య,, మోదుగు శ్రీను, ముత్యాల కృష్ణారెడ్డి, తేళ్లూరి గోపాలరావు, రాము, సత్యం తదితరులు పాల్గొన్నారు.













# పేద మధ్యతరగతి మహిళలకు ఆర్థిక చేయూత లక్ష్యంగా సేవా కార్యక్రమం

**కల్లూరు,ఫిబ్రవరి 21(జనంసాక్షి)**
పేద మధ్యతరగతి మహిళలకు ఆర్థికచేయుత లక్ష్యంగా సెంటర్ ఆఫ్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు అసోసియేషన్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సిడిఎ కార్యదర్శి ఎనోష్ కుమార్ అన్నారు. శనివారం కల్లూరు లో సి డి ఏ సంస్థ ద్వారా పలువురు మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మాధవి లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ మాధవి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడం సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.. ఒక మహిళ ఆర్థికంగా బలపడితే కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుంది అని పేర్కొన్నారు. సి డి ఎ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని ఆమె అభినందించారు. అనంతరం సి డి ఎ కార్యదర్శి ఎనోశ్ కుమార్ మాట్లాడుతూ 2023 నుండి ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో 100 మంది మహిళలకు ఉచిత శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు స్వంతంగా కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేసుకుని ఆదాయం సంపాదిస్తూ కుటుం బాలకు అండగా నిలుస్తున్నారని వివరించారు. గ్రామీణ ప్రాం తాల్లో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని సి డి ఎ ఆధ్వర్యంలో మంచినీటి బోర్లు ఏర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలు దాతలు, స్నేహితుల సహకారంతో కొనసాగిస్తున్నట్లు తెలిపారు . అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ మాధవిని శాలువల తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాలరాజు, తేళ్ల ఎబినేజర్, ప్రభాకర్, సిస్టర్ చంద్రలీల, మహిళలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రం శివరాత్రి జాతర ఆదాయం రూ: 7.45లక్షలు

కల్లూరు ఫిబ్రవరి 21 (జనంసాక్షి)
కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని పుల్లయ్య బంజారా గ్రామ సమీపానగల శ్రీ కాశ్మీర్ మహాదేవ క్షేత్రం(అప్పయ్య స్వామి శివాలయం) లో మహాశివరాత్రి జాతర సందర్భంగా వచ్చిన హుండీ ఆదాయాన్ని ఎండోమెంట్ శాఖ ఖమ్మం డివిజన్ పరిశీలకులు ఆర్ సమత, ఆలయ మేనేజర్ ఎస్ వి డి ప్రసాద్, ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. ఫిబ్రవరి 15వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు జరిగిన తిరునాళ్ల జాతరకు సంబంధించి వివిధ రూపాల్లో రూ 7.45 లక్షల రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ శాఖ ఆలయ మేనేజర్ ఎస్ వి డి ప్రసాద్ తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జాతరలో వివిధ రకాల దుకాణాల ఏర్పాటు వేలం పాట ఇతరముల ద్వారా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. దర్శనం అభిషేకములపై ఆదాయం1,26,401 లక్షలరూపాయలు కళ్యాణ, కట్నాలు8,107 వేలు పీటల మీద కూర్చున్న దంపతులు 6,696. వేలు,



జైయింట్ వీల్1,30,000. లడ్డూపాట 20,000, మిఠాయి షాపుల ద్వారా1,80,000 , కొబ్బరికాయలు అమ్మకం45,500, .కొబ్బరి చిప్పలు ప్రోగు చేసుకొను హక్కు పాట10,500, పార్కింగ్ ద్వారా12,000 షాపుల ఆదాయం 34,100హుండీ లెక్కింపు1,72,505. రూపాయలు మొత్తం ఆదాయం 7 లక్షల, 45వేల,809. రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.గత సంవత్సర ఆదాయం 7,62,597. లక్షలు వచ్చిందని ఈఏడాది 16,788 వేల రూపాయల ఆదాయంతక్కువగా వచ్చినది అని తెలిపారు. జాతర ఆదాయం లెక్కింపు కార్యక్రమంలో ఎండోమెంట్ శాఖ డివిజన్ పరిశీలకురాలు ఆర్ సమత, ఆలయ మేనేజర్ ఎస్ వి డి ప్రసాద్, అర్చకులు సురేష్, పలువురు వాలంటీర్లు , మహిళలు,భక్తులు పాల్గొన్నారు.




# జాతర పోస్టర్ ఆవిష్కరణ

**కనగల్లు, ఫిబ్రవరి 21 (జనం సాక్షి)**
మండలంలోని రేగట్టె శ్రీ భవాని శంకర స్వామివారి బ్రహ్మోత్సవాలు (జాతర) ఈనెల 26 నుంచి మార్చి 1 వరకు కొనసాగుతాయని ఆలయ చైర్మన్ గంజి చంద్రమౌళి, స్థానిక సర్పంచ్ భారత కవితవెంకటేశం లు తెలిపారు. శనివారం గ్రామంలోని ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులతో కలిసి జాతర పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి దొమ్మాటి అంజయ్య, కోశాధికారి కర్నాటి శ్రీనివాస్, సభ్యులు పాలకూరి వెంకటేశం, కొప్పుల సత్యనారాయణ, ఎర్రోళ్ల ఎల్లయ్య, పులకరం ఎల్లప్ప, ఏకాలపు కోటేష్, జిల్లా రాజు, రావుల వెంకటేష్, భారత సాయి కమార్, వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ లకు సన్మానం



**నేరేడుచర్ల (జనంసాక్షి ):**
మున్సిపల్ ఎన్నికలలో కౌన్సిలర్స్ గా గెలుపొంది మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన కొణతం చిన్న వెంకటరెడ్డి, నూకల సందీప్ రెడ్డి లకు పట్టణ బిజెపి అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి, పట్టణ నాయకుల ఆధ్వర్యంలో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలు ఉండాలని తదుపరి అందరూ ప్రజల అభివృద్ధికై అవసరాలపై శ్రమించాలని, ప్రజలను రాజకీయ పార్టీల పరంగా చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను ఇప్పించాలని,నేరేడుచర్ల మున్సిపాల్టీ అభివృద్ధి పథంలో నడిపించుటకు ప్రతిపక్షాలుగా ఎల్లప్పుడూ మా మద్దతుగా ప్రయత్నం చేస్తామని అందుకు అధికార పార్టీ నిజాయితీతో పని చేయాలని కోరగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు మేము కూడా రాజకీయాలకు అతీతంగా ప్రజలకు పథకాలు అమలు చేస్తామని,అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ గా ఎన్నికైన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఏమిరెడ్డి శంకర్ రెడ్డి, కాలం నాగయ్య, రాష్ట్ర నాయకులు బాల వెంకటేశ్వర్లు,జిల్లా కోశాధికారి తాళ్ల నరేందర్ రెడ్డి, జిల్లా నాయకులు సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు వురిమళ్ళ రామ్మూర్తి,ఆకుల జగతయ్య, బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నందిపాటి హిందూజ, కొప్పు లక్ష్మీనారాయణ,ఆఫీస్ ఇన్చార్జి దేవిరెడ్డి నాగిరెడ్డి,కాలం శైలజ, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ ను రద్దు చేయాలి..

## పాత పద్ధతిలోనే యూరియా ఇవ్వాలని రైతుల ధర్నా..

**మిర్యాలగూడ (ఫిబ్రవరి 22) జనంసాక్షి :**
యూరియా ఆన్లైన్ యాప్ ను రద్దు చేసి పాత పద్ధతిలోని రైతులకు యూరియా అందించాలని వేములపల్లి మండల కేంద్రంలో రైతులు ధర్నా నిర్వహించడం జరిగింది. శనివారం ఉదయం 10 గంటలకు ఆన్లైన్ యాప్ యూరియా లో ఉంచుతామని కోపరేటివ్ అధికారులు తెలపడంతో పెద్ద సంఖ్యలో రైతులు వేములపల్లి కోపరేటివ్ బ్యాంకు దగ్గరికి రావడం జరిగింది ఆన్లైన్లో ఓపెన్ అయిన యూరియా కొద్ది క్షణాల్లో అయిపోవడంతో ఆగ్రహించిన రైతులంతా సహకార సంఘం ఎదురుగా అద్దంకి నార్కెట్పల్లి రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించడం జరిగింది. ప్రభుత్వం ఆన్లైన్ యాప్ విధానం పెట్టడం వల్ల ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులు ఇబ్బంది పడుతున్నారని పంట పొలాలు దెబ్బతింటున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పాత పద్ధతిలోనే రైతులకు యూరియా అందించాలని అన్నారు. ఏం తెలుసుకున్నా మెంటల్ వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్ ఏ ఈ ఓ నితిన్ నాయక్ మండల ఎస్సై వెంకటేశ్వర్లు రైతుల దగ్గరికి వచ్చి వారికి నచ్చ చెప్పి ధర్నా విరమింప చేయడం జరిగింది.

# ఘనంగా శ్రీ సంతు సేవాలాల్ జయంతి వేడుకలు



**చంద్రుగొండ, ఫిబ్రవరి 21( జనంసాక్షి):**
ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు చంద్రుగొండ మండల పరిధిలోని పోకల గూడెంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బంజారా నాయకులు పాల్గొనగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత శ్రీ సంత సేవాలాల్ మహారాజ్ చిత్రపటాని ఎడ్ల బండి పై ఉంచి గ్రామంలో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ గుగులోతు బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు భోజ్యానాయక్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజుని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ జి రవిబాబు, వెంకటాయ తండా సర్పంచ్ మాలోత్ పద్మ, ఎల్ హెచ్ ఎస్ పి ఎస్ నాయకులు మోహన్ నాయక్, గ్రామ నాయకులు బద్రునాయక్ చందర్ నాయక్, గిరిజనులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్ట్ లతో ఉద్యమాన్ని ఆపలేరు

## బిజెవైఎమ్ మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్




**నాంపల్లి, ఫిబ్రవరి 21(జనంసాక్షి)**
ఇండియా ఎఐ ఎక్స్పోలో నిన్న కాంగ్రెస్ నాయకులు భారతమండపంపై దాడి చేసి భారత ప్రధాని నరేంద్ర మోడీ నీ అవమానపరచాడన్ని నిరసిస్తూ బిజెపి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో గాంధీభవన్ ముట్టడికి పిలుపు ఇచ్చింది. దానికి నాంపల్లి పోలీస్ లు తెల్లవారుజామున బీజేవైఎం మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ ని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ అరెస్ట్ లకి భారతీయ జనతా పార్టీ బయపడదని, అరెస్ట్ లు,లాఠీ దెబ్బలు,జైల్లు మాకు కొత్త కాదని హెచ్చరించారు. ఎన్ని విధాలుగా ఇబ్బందులు పెట్టిన ప్రజల పక్షాన నిలబడతామని బీజేవైఎం మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ అన్నారు.

# గ్రీన్ వుడ్ పాఠశాల నందు ఘనంగా ఎడ్యుకేషన్ ఫేయిర్ ప్రదర్శన

**హుజూర్ నగర్, (జనంసాక్షి):**
పట్టణంలోని గ్రీన్ఉడ్ పాఠశాల నందు ఎడ్యుకేషన్ ఫేయిర్ ఘనంగా నిర్వహించామని పాఠశాల ఛైర్మన్ తుమ్మలూర్డు మర్రెడ్డి అన్నారు. శనివారం ఈ కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని హుజూర్ నగర్ మున్సిపల్ ఛైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ ఛైర్మన్ తన్నీరు మల్లికార్జున్ లు ప్రారంభించారు. విధ్యార్థులు అనేక రకాల సైన్స్, విజ్ఞాన సంబంధిత పరికరాలతో ఏర్పాటు చేసిన మోడల్స్ పలువురిని ఆకర్షించాయి.
దీనిద్వారా విధ్యార్థుల్లో విజ్ఞాన పరిజ్ఞానం అభివృద్ధి జరుగుతుందని, విజ్ఞాన్ని వెలికితీసే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడంలో గ్రీన్ఉడ్ పాఠశాల ముందు ఉంటుంది అని పాఠశాల ఛైర్మన్ తుమ్మ లూర్డు మర్రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 25వ వార్డ్ కౌన్సిలర్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డి, 3వ వార్డ్ కౌన్సిలర్ సులువ నాగలక్ష్మి చంద్రశేకర్, 4వ వార్డ్ కౌన్సిలర్ దొంతి రెడ్డి పద్మ , 5వ వార్డ్ కౌన్సిలర్ యరగాని సుష్మా మురళి, 19వ వార్డ్ కౌన్సిలర్ వల్లపుదాసు కృష్ణ, పాఠశాల డైరెక్టర్ తుమ్మ సరిత, ప్రిన్సిపల్ రాజ రెడ్డి, గ్రీన్ఉడ్ డే క్యాంపస్ ప్రిన్సిపల్ కృష్ణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, విధ్యార్థులు పాల్గొన్నారు.



# నేటి నుండి చండూరు జాతర

అనంతరం 50 జతల ఎద్దుల శకటముపై చేనేత మగ్గమును ఏర్పాటు చేసి, శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రములు నేసెదరు. ఈ సందర్భంగా ఊరేగింపు నిర్వహించెదరు. సాయంత్రం హోమము, బలిహరణ, భేరిపూజలు జరుగును. రాత్రి 8 గంటలకు ఎదుర్కోలు ఉత్సవము, దేవాలయము ముందు రకరకాల పూలతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించిన కళ్యాణ మండపంలో శ్రీ పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవము జరుపబడును. 24 మంగళవారం గాయత్రీ యజ్ఞం, అన్న ప్రసాద వితరణ, 25 బుధవారం రథోత్సవం,26 గురువారం అగ్నిగుండాలి నిర్వహిస్తారు.

## అజ్మీర సౌజన్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శ్రీ. నల్లమోతు భాస్కర్ రావు



**జనంసాక్షి, మిర్యాలగూడ (ఫిబ్రవరి-22)**
దామరచర్ల మండలంలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన అజ్మీర సౌజన్య(31) హటన్మరణం చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీ. నల్లమోతు భాస్కర్ రావు వారి కుటుంబాన్ని పరామర్శించి తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ, కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు మరియు ఇతర కారణాలతో ఇలాంటి దుర్ఘటనలు జరగడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని అధికారులను కోరారు. వారి వెంట దుర్గంపూడి నారాయణ రెడ్డి, అంగోతు హతిరాం నాయక్, పడిగపాటి సైది రెడ్డి, పలసాని రాంరెడ్డి,ధీరావత్ పాచు నాయక్, రజిత మల్లు నాయక్, పురన్ సింగ్,శ్రీనివాస్,లింగా నాయక్, పున్ని శ్రీను,భాష్య,బద్య,వాగ్య నాయక్, ప్రసాద్, మెగా నాయక్, రమావాత్ వినోద్ నాయక్,రమేష్ నాయక్,వాంకుడోతు సేవా నాయక్, ఃఖీా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కుటుంబానికి మద్దతు తెలిపారు.



## హుజూర్ నగర్ చైర్మన్, వైస్ చైర్మన్ లకు ఘనంగా సన్మానం

**హుజూర్ నగర్, (జనంసాక్షి) :**
హుజూర్ నగర్ మున్సిపల్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్ పర్సన్ తన్నీరు మల్లికార్జున్ రావు లను 16వ వార్డు మాజీ కౌన్సిలర్ కారింగుల విజయ వెంకటేశ్వర్లుగౌడ్ ఆధ్వర్యంలో పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. శనివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో 16వ వార్డుపై ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ లు మాట్లాడుతూ గెలిచిన కౌన్సిలర్లతో పాటుగానే మాజీ కౌన్సిలర్లకు, కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు తమ వార్డుల అభివృద్ధి విషయంలో సముచిత స్థానం తమకు లభిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుక్కడపు మహేష్ గౌడ్, చామకూరి శ్రీధర్, కుక్కడపు నరసింహారావు, నక్క నరేష్, నక్క బాలకృష్ణ, బత్తిని వీర ప్రసాద్, కారింగుల వినోద్, ఆకుల వినోద్, బంటు బుచ్చయ్య, కొండ హరీష్, ముత్తు వినో,రుద్రోజు సతీష్,బత్తిని సాయి, కుక్కడపు మేఘూశ్యం తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ మరమ్మత్తులకు ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చేయూత

**చౌటుప్పల్ ఫిబ్రవరి 21(జనంసాక్షి)**
గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో మునుగోడు మండలం కలవలపల్లి గ్రామంలోని వాటర్ ఫిల్టర్ ప్లాంట్ మరమ్మతులకు వచ్చింది. దీంతో ప్రజలు త్రాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ భాస్కర్ గారి సూచన మేరకు డైరెక్టర్ అశోక్ 45 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలవలపల్లి గ్రామంలో గత కొంతకాలంగా వాటర్ ప్లాంట్ పనిచేయక పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నిధులతో వెంటనే వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేపట్టి, యథావిధిగా త్రాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ సమస్యల పరిష్కారానికి ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని గ్రామస్తులు అభినందించారు.





## ఘనంగా షిర్డీ సాయి బాబా దేవాలయంలో 24వ వార్షికోత్సవ వేడుకలు

**భువనగిరి రూరల్,ఫిబ్రవరి 21(జనం సాక్షి)**
భువనగిరి మండలం లోని బండసోమరం గ్రామంలోని శిరిడి సాయి బాబా దేవాలయంలో 24వ వార్షికోత్సవాన్ని వేడుకలు ట్రస్ట్ అధ్యక్షులు రావి శ్రీహిత రాజేందర్ రెడ్డి , ట్రస్ట్ సెక్రటరీ గుండేటి హరిబాబు,దీపిక శ్రీనివాస్ రెడ్డి , సుమంతి నరసింహారెడ్డి,కాటిక అనుజరాణి జంగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం రోజున ఉదయం 6 గంటల 30 నిమిషాలకు పతావిష్కరణ. 7 గంటలకు గణపతి హె?మం. 8 గంటలకు ధుని పూజా, 8 గంటల 30 నిమిషాలకు బాబాకి ప్రత్యేక అభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి 12 గంటల 30 నిమిషాలకు సాయి తీర్థప్రసాద వితరణ మరియు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రావి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గత 24 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిటి సభ్యులు, గ్రామ పుర ప్రముఖులు పలువురు మాట్లాడుతూ ఈ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణకు జరగడానికి సహకరించిన గ్రామస్తులకు పాలకవర్గానికి మరియు దాతలకు, సాయిబాబా భక్తులకు, పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండ సోమారం గ్రామ సర్పంచ్ కాటిక కాటిక జంగయ్య , ఉప సర్పంచ్ నల్లమాసు రాజు , సురపంగా స్వామి, సురుపంగా మైసమ్మ , నల్ల మాసు భాను , ఎర్రం శ్రావణి బిక్షపతి , కొల్తూరి బాలరాజు , మజ్జిగ సంతోష , ఏమల్ల లావణ్య గ్రామ శాఖ అధ్యక్షుడు నల్ల మాసం అశోక్ గౌడ్ , పెద్దలు బురుగు లక్ష్మారెడ్డి , భగవంతు రెడ్డి , శంకర్ రెడ్డి , భాస్కర్ , నరసింహ , సింగిల్ విండో మాజీ చైర్మన్ బల్గూరి మధుసూదన్ రెడ్డి , చందుపట్ల గ్రామ సర్పంచ్ కంకర్ల లక్ష్మి కిష్టయ్య , మాజీ సర్పంచ్ చిన్నం పాండు బండ సోమవారం గ్రామస్తులు , సాయి బాబా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కిడ్జ్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

**సూర్యాపేట (జనంసాక్షి) :**



జిల్లా కేంద్రం లోని విద్యానగర్ లో గల కిడ్జ్ ప్లే స్కూల్ నాలుగోవ వార్షికోత్సవ వేడుకలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది, వైస్ చైర్మన్ షఫీఉల్లా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు గండూరి కృపాకర్, ఫారుక్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. చిన్నారులను వారికి ఆసక్తి ఉన్న రంగాలను గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం స్కూల్ కరస్పాండెంట్ గుండా ఉజ్వల్ మాట్లాడుతూ ప్రత్యేకంగా చిన్నారుల కోసం తమ పాఠశాలలో ప్లే వే మెథడ్ లో బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రత్యేక వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జ్ ప్రదీప్, స్కూల్ ప్రిన్సిపాల్ నిత్య, ఇన్చార్జ్ స్వప్న, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళనతో స్పందించిన విజె సాయి యాజమాన్యం రూ.80 లక్షల నష్టపరిహారం హామీ



**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి):**
పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలోని విజె సాయి రసాయన కంపెనీలో జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో మృతి చెందిన సీనియర్ కెమిస్ట్ దార పవన్ (36) కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాలు ఆందోళన చేపట్టారు. ఆందోళనతో యాజమాన్యం స్పందించి రూ. 80 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని లిఖితపూర్వకంగా తెలియజేసింది. ఈ సందర్భంగా వెంటనే రూ. 5 లక్షల నగదును కుటుంబానికి అందజేశారు. మిగిలిన రూ. 75 లక్షలను విడతల వారీగా ప్రతినెల చెల్లిస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# ఘనం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం



**నల్లగొండ, ఫిబ్రవరి 21 (జనంసాక్షి)**
ఘనం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం చిట్యాల మండలం చిన్నకాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు వారి వారి శైలిలో వివిధ రకాల స్థానికంగా లభ్యమయ్యే సాంస్కృతిని ప్రతిబింబించే ఎన్నో రకాల అంశాలను ప్రవేశపెట్టారు. విసుర్రాయి, కల్లుకుండా, ఉగాది పచ్చడి, పచ్చీసు, అర్చన గాయలు, చిర్రగోని వివిధ రకాల పిండితో అక్షరాలను పదాలను తయారు చేశారు. చిన్నప్పుడు ఆడుకున్న వివిధ రకాల ఆటల ప్రదర్శన తో పాటు పోతురాజు, శివుడు, అమ్మోరు కూచిపూడి, నృత్య కళాకారిణి, పల్లెటూరు పడుచు తెలంగాణ తల్లి మొదలైన వేషాలతో భాషా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ ప్రదర్శనలో చిన్నారులు ప్రదర్శించిన నాటిక అందర్నీ ఆకట్టుకున్నది ఈ సమావేశాన్ని ఉద్దేశించి పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మాతృభాష అనేది ఒక ప్రాంతాన్ని కాకుండా ఒక భాష కాకుండా అందరికీ వారి వారి భాషను బట్టి ఈ దినోత్సవం జరుపుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పలువుపాధ్యాయులు తెలుగు భాషా దినోత్సవం గురించి ఉపన్యసించారు. ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు గ్రామ పెద్దలు మొదలైన వారు సందర్శించి ఆనందించారు పలువురు విద్యార్థులను మెచ్చుకున్నారు. కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించినందుకు తెలుగు ఉపాధ్యాయులు చంద్రశేఖర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు భూపాల్ రెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయులు బాలకృష్ణ, సైన్స్ ఉపాధ్యాయులు నయీముద్దీన్, గణిత ఉపాధ్యాయులు అష్రాఫ్ అలీ,మరొక గణిత ఉపాధ్యాయురాలు మాధవి మరియు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు సాయిబాబా, తెలుగు ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ హిందీ ఉపాధ్యాయురాలు రేవతి, వాలంటీర్లు శ్రీలత,నవ్య శిరీష పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల అక్రమ అరెస్టులు దుర్మార్గం ప్రజాస్వామ్యమా పోలీసు రాజ్యమా

**కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నిస్తే అరెస్టులా**
**మండిపడ్డ జిల్లా బిజెపి శ్రేణులు**
**మాడుగులపల్లిలో బిజెపి కిసాన్ మోర్చా నాయకుల ముందస్తు అరెస్టు**




**మాడుగులపల్లి ప్రతినిధి ఫిబ్రవరి21 జనంసాక్షి:**
ఇండియా ఏ ఐ ఎక్స్‌పో సమ్మిట్‌లో కాంగ్రెస్ శ్రేణుల అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందని బిజెపి నాయకులు మండిపడ్డారు కాంగ్రెస్ కార్యాలయాలపై దాడులు చేస్తారనే నెపంతో ఎటువంటి కారణం లేకుండా బిజెపి,బీజేవైఎం కార్యకర్తలను, నాయకులను పోలీసులు ముందస్తుగా అక్రమ అరెస్టులు చేయడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. పోలీసుల ముందస్తు అరెస్టులలో భాగంగా జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి, జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ బొమ్మకంటి నరసింహ, బిజెపి గ్రామ అధ్యక్షులు రాజవరపు గురుస్వామి, మండల అధ్యక్షులు ఇటికాల జాన్ రెడ్డి, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు దాసరి నాగరాజు, మండల సోషల్ మీడియా కన్వీనర్ దారమల్ల నాగరాజు, బూత్ అధ్యక్షులు చిలుముల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకుల గుడిగుంట్ల శ్రీను తదితరులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ గుండాల నిస్సిగ్గు ప్రవర్తనను కప్పిపుచ్చుకోవడానికి బిజెపి కార్యకర్తలను వేధించడం సరికాదు అని ధ్వజమెత్తారు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ అర్ధరాత్రి వేళల్లో ఇళ్లపై పడి అరెస్టులు చేయడం పోలీసు రాజ్యానికి నిదర్శనమని విమర్శించారు ప్రభుత్వం ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా కాంగ్రెస్ అరాచకాలను ఎండగట్టి తీరుతామని వారు హెచ్చరించారు.

## కనకటి వెంకన్న ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కిషోర్

**నూతనకల్ ఫిబ్రవరి 21( జనం సాక్షి)**
నూతనకల్ మండల పిఏసిఎస్ మాజీ చైర్మన్ కనకటి వెంకన్న తండ్రి బుచ్చయ్య ఇటీవల మృతి చెందాడు శనివారం తుంగతుర్తి మాజీ శాసనసభ్యుడు గాదరి కిషోర్ కుమార్ మిర్యాల గ్రామంలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. బుచ్చయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నూతనకల్ మద్దిరాల బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మున్న మల్లయ్య యాదవ్,ఎస్ఏ రజాక్, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, బత్తుల సాయిల్ గౌడ్,జక్కి పరమేష్, సర్పంచులు గాడుదుల లింగరాజు యాదవ్, మహేశ్వరం మల్లికార్జున్, జటంగి సరిత కృష్ణ యాదవ్, నాయకులు మున్నా లింగయ్య యాదవ్, రేసు వెంకటేశ్వర్లు, బత్తుల విద్యాసాగర్, కనకటి మహేష్, బండి అనిల్, మన్నెం సైదులు, రమేష్,కనకటి లింగన్న, మహేష్, కాట్ల యాకన్న,మధు తదితరులున్నారు.





## అక్రమ ఇసుక డంపును సీజ్ చేసిన ఎస్సై యుగంధర్

వలిగొండ మండలం ఫిబ్రవరి 21 (జనం సాక్షి )
మండలంలోని గోకారం గ్రామానికి చెందిన మందుల నరసింహ ,ఎర్ర రామంజి కలిసి మూసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో ఇసుక తరలించి గొల్లపల్లి గ్రామ శివారులో నిలువ చేశారు. సమాచారంతో వెళ్లిన పోలీసులు అక్రమ నిలువ చేసిన 100 టన్నుల ఇసుక డంపును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై యుగంధర్ తెలిపారు.

## రైతు సంక్షేమమే ధ్యేయంగా.. చందూరు రైతులకు బంపర్ ఆఫర్

**ఉచితంగా రైతు అగ్రి షో' సందర్శన..**

**వాహనం, భోజనం ఏర్పాటు చేసిన టి.ఆర్. ఫౌండేషన్**



**చండూరు, ఫిబ్రవరి 21 (జనంసాక్షి):**
వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన మార్పులు, సాంకేతికతపై రైతులకు అవగాహన కల్పించేందుకు చండూరు మండల రైతులను హైదరాబాద్‌లో జరిగే మన రైతు అగ్రి షో కు పంపించనున్నట్లు టి.ఆర్. ఫౌండేషన్ అధినేత బొబ్బల వెంకట్రాంరెడ్డి తెలిపారు. ఈ నెల 22వ తేదీన హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతు బడి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ భారీ వ్యవసాయ ప్రదర్శనకు వెళ్లే చండూరు మండల రైతుల కోసం టి.ఆర్. ఫౌండేషన్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రైతులకు ఎటువంటి ఖర్చు లేకుండా ఉచిత ప్రయాణ సౌకర్యం, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సందర్శన ఫిబ్రవరి 22 (ఆదివారం) ఎన్టీఆర్ స్టేడియం, హైదరాబాద్. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. "భూమిని నమ్ముకున్న రైతన్నకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంచడమే మా లక్ష్యం. ఈ ప్రదర్శనలో సాగుకు సంబంధించిన విలువైన సమాచారం, కొత్త పరికరాల గురించి తెలుసుకోవచ్చు. కావున చండూరు మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని పిలుపునిచ్చారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

**తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఇటికాల శ్రీనివాస్**



**పెన్ పహాడ్, ఫిబ్రవరి 21(జనం సాక్షి) :**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఉత్తమంగా చదువుకొని తల్లిదండ్రులకు,పాఠశాలకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సర్పంచ్ ఇటికాల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మాచారం ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు ఉత్తమంగా బోధించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం విద్యార్థుల చేత వారి యొక్క విద్యాభ్యాసాన్ని తెలుసుకోవడం కోసం అన్ని సబ్జెక్టులో వారికి ఉన్న ప్రావీణ్యాన్ని పఠనం చేయించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిరెడ్డి సరిత సందీప్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎల్క చంద్రకళ, ఉపాధ్యాయులు మిరియాల హరికృష్ణ, వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు...

## సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ జయ కుమార్



నూతనకల్ ఫిబ్రవరి 21( జనం సాక్షి) గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వెంకేపల్లి సర్పంచ్ ఇమ్మడి జయకుమార్ అన్నారు. శనివారం ఉపాధి హామీ నిధులనుండి రూ. ఐదు 5 లక్షల వ్యయంతో నిర్మించే సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంట్ల బుచ్చిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు తొణుకునూరి సైదులు గౌడ్, కుంట్ల చంద్రారెడ్డి,పాల్వాయి నాగయ్య, అనిత,పవన్ రెడ్డి మెట్టు అనంతరెడ్డి పాల్వాయి వీరస్వామి లింగయ్య రమేష్ వెంకన్న గంగాధరి లక్ష్మికాంత్ పాల్వాయి వెంకటయ్య నాగయ్య నాగార్జున తదితరులున్నారు.